సాక్షి
అనంతపురం
గురువారం । 8 । మే । 2025



వేగం.. సులభం.. సురక్షితం!

కిళ్లీ కొట్టు మొదలు షాపింగ్ మాల్స్ వరకూ డిజిటల్ పేమెంట్‌లు ఊపందుకున్నాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం క్యూ ఆర్ కోడ్లు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. 10లో



చీనీ టన్ను రూ.24,500

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,500 పలికాయి.

గరిష్టం/కనిష్టం
40.5°/24.9°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

'చల్లటి' కబురు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు 'చల్లటి' కబురు అందింది.ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయ శంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి. నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. రాగల ఐదు రోజులూ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతాయని, ఆ తర్వాత స్వల్పంగా పెరిగే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ గోల్డ్ మెడల్


కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న కలెక్టర్ వి. వినోద్‌కుమార్‌కు ప్రతిష్టాత్మక రెడ్‌క్రాస్ గోల్డ్ మెడల్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ప్రకటించింది. రాష్ట్రంలో 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాలకు గానూ తొమ్మిది మంది కలెక్టర్లు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. రాయలసీమ జిల్లాల నుంచి అనంతపురం కలెక్టర్‌కు అవార్డు దక్కింది. కలెక్టర్ నాయకత్వంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నారు. ఈనెల 8న అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా అమరావతిలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డు అందుకోనున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి కలెక్టర్ వినోద్‌కుమార్ విశేష కృషి చేశారు. పాతూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, 25 కిలోవాట్ల సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు చేయించారు. అఫెరిసిస్ యంత్రం సమకూర్చడం, ప్లేట్‌లెట్ అజిటేటర్స్ స్థాపన, ఆటో ఇమ్యునైజేషన్ అనలైజర్ ప్రవేశపెట్టడంతో పాటు ఐ రిట్రీవల్ సెంటర్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 91 రక్తదాన శిబిరాల ద్వారా 5,872 యూనిట్ల రక్తం సేకరించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న 9,479 మందికి వాటిని అందజేశారు. జిల్లా రక్త కేంద్రానికి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందేలా కృషి చేశారు. జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమంలో 5,621 మంది విద్యార్థుల చేరికతో సమాజ సేవలో జిల్లా శాఖ ప్రత్యేక స్థానంలో నిలిచింది.

ఆదర్శప్రాయుడు 'అల్లూరి'

- కలెక్టర్ వినోద్‌కుమార్


అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ వారితో పోరాడి ప్రాణాలర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ ఎ.మలోల, జిల్లా పర్యాటక అధికారి జయకుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

2014 ఖరీఫ్‌లోనే హంద్రీ–నీవా ద్వారా ఆయకట్టుకు నీరిస్తామన్నారు. స్వయంగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబే హామీ ఇచ్చి మాట తప్పారు. ఆ తర్వాత 2015, 2016 అన్నారు. గడువు మారింది తప్ప ఆ దిశగా చర్యలు చేపట్టనే లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీ–నీవా కింద డిస్ట్రిబ్యూటరీలనే ఏర్పాటు చేయరాదంటూ ఏకంగా జీఓ తెచ్చి రైతుల ఆశలపై నీళ్లు చల్లారు. డిస్ట్రిబ్యూటరీలు ఏర్పాటు చేసి ఆయకట్టుకు నీరివ్వకుండా నేడు కాలువ విస్తరణ పేరిట హంగామా చేస్తుండటంపై అన్నదాతలు మండిపడుతున్నారు.


చిన్నముష్టూరు వద్ద హంద్రీ–నీవా కాలువలో వర్షపు నీటిలో పైపైనే మట్టిని పక్కకు జరుపుతున్న దృశ్యం

నీరున్నా.. కన్నీరే

- మాట నిలుపుకోని సీఎం చంద్రబాబు
- హంద్రీ–నీవా డిస్ట్రిబ్యూటరీలను అటకెక్కించి దగా
- నేడు విస్తరణ పేరిట ఆర్భాటం
- రైతులకు ఒరిగేది శూన్యం



ఛాయాపురం వద్ద పనులిలా.., రాగులపాడు వద్ద కాలువలో నిలిచిన నీరు

ఉరవకొండ: దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి మానస పుత్రిక అయిన హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం కరువు పీడిత అనంతపురం జిల్లాకు జీవనాడి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించాలనే లక్ష్యంతో అప్పట్లో ఈ పథకానికి రూపకల్పన చేశారు. అయితే, వైఎస్సార్ ఆకస్మిక మరణంతో లక్ష్యం నీరుగారిపోయింది. హంద్రీ–నీవా ఫేజ్–1 కింద 2012లో పనులు పూర్తయి జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు చేరినా, నేటికీ పొలాలను తడపలేకపోతుండటమే ఇందుకు నిదర్శనం.

బూటకపు ప్రకటనలతో సరి..

హంద్రీ–నీవా ఆయకట్టుకు సాగునీరు ఇస్తామని 2014 నుంచి బూటకపు ప్రకటనలు చేస్తూనే ఉన్న చంద్రబాబు.. క్షేత్రస్థాయిలో ఎక్కడా అందుకు సంబంధించిన పనులు చేపట్టనే లేదు. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలో 33, 34 ప్యాకేజీ పనులు నేటికీ పూర్తి కాలేదు. ఈ ప్యాకేజీల కింద 28 వేల ఎకరాల ఆయకట్టు ఉండటం గమనార్హం. అబద్ధపు హామీలతో ఊరిస్తూ వచ్చిన చంద్రబాబు.. 2015లో హంద్రీ–నీవా కింద డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేయరాదంటూ ఏకంగా జీఓ నం.22 తీసుకొచ్చి అన్నదాతలను నైరాశ్యంలోకి నెట్టారు. దీనిపై అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న విశ్వేశ్వరరెడ్డి అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తే.. 2017 ఖరీఫ్‌కు సాగునీరు ఇస్తామని ప్రకటించి ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. ఈ విషయంపై ఆ తర్వాత కూడా మాజీ ఎమ్మెల్యే విశ్వ ఉద్యమాలు చేపట్టినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు.

అంతా ఆర్భాటమే..

ఆయకట్టుకు నీళ్లందించడంపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం.. నేడు హంద్రీ–నీవా కాలువ విస్తరణ పేరిట ఆర్భాటం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే 3,800 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యంతో రూపకల్పన చేసిన కాలువను 6 వేల క్యూసెక్కులకు పెంచుతామని ఇటీవల ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే, నేడు ఆ హామీని తుంగలో తొక్కుతూ విస్తరణ పేరుతో కొత్త నాటకానికి తెరలేపారు. ఆ పనులు కూడా అస్తవ్యస్తంగా సాగుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. ఈ నెల 9న సీఎం పర్యటన నేపథ్యంలో కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారని చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో నీళ్లు నిలిచాయి. ఈ క్రమంలో జేసీబీల సాయంతో కేవలం కాలువకిరువైపులా మట్టిని పక్కకు జరిపి చేతులు దులుపుకుంటున్నట్లు తెలిసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రయోజనం శూన్యం



కూటమి ప్రభుత్వం చేపడుతున్న హంద్రీ–నీవా కాలువ విస్తరణ పనులతో రైతులకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం కాలువను 6 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలి. అప్పుడే ఈ ప్రాంత రైతులకు మేలు చేకూరుతుంది.

– పెద్దముష్టూరు వెంకటేష్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు

ఆయకట్టుకు నీరివ్వాలి



కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హంద్రీ–నీవా కింద ఆయకట్టుకు సాగు నీరు అందించాలి.గతంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకోవాలి. కాలువ విస్తరణ పనులు కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే చేస్తున్నారు.

– మేకల సిద్దార్థ్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు, ఉరవకొండ

సీఎం పర్యటనలో లోటుపాట్లకు తావివ్వొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

వజ్రకరూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. ఈ నెల 9న వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌తో కలిసి ఛాయాంపురంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సీఎం సభకు 3,000 మంది హాజరయ్యేలా చూడాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలన్నారు. హెలీప్యాడ్ వద్ద భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. 'బంగారు కుటుంబం' లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కాగా, కలెక్టర్,ఎస్పీలతో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ కూడా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, సీఎంఓ అధికారులు దినేష్, ఏఎస్పీ రమణ మూర్తి,ఆర్డీఓలు కేశవనాయుడు, శ్రీనివాసులు, వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకే రూమ్ ఇవ్వరా?

- హోటల్ సిబ్బందిపై దగ్గుపాటి అనుచరుల వీరంగం
- అప్పటికప్పుడు పోలీసులతో హోటల్‌పై రైడింగ్
- ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులనూ ఉసిగొల్పిన వైనం




ఎమ్మెల్యే ఆదేశాలతో అలెగ్జాండర్ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'ఎమ్మెల్యే మనుషులొస్తే రూములు లేవంటారా.. ఎంత ధైర్యం మీకు.. ఇకపై మీరు హోటల్ ఎలా నడుపుతారో చూస్తాం' అంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు వీరంగం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన అనుచరులతో మాట్లాడుకోవడానికి సూట్‌రూమ్ కావాలని తన ముఖ్య అనుచరుడిని నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌కు పంపించారు. అయితే హోటల్ మేనేజర్ రూములు ఖాళీగా లేవని చెప్పారు. దీంతో కోపోద్రిక్తులైన ఎమ్మెల్యే అనుచరులు పరుష పదజాలంతో మేనేజర్‌పై విరుచుకుపడ్డారు. మెడపట్టి గెంటినట్టు బాధిత సిబ్బంది చెప్పారు. ఇవన్నీ సీసీ ఫుటేజీల్లో రికార్డయ్యాయి. గొడవ సమయంలో హోటల్‌లో ఎమ్మెల్యే అనుచరులు గంగారాం, పి.హరిక్రిష్ణ ఉన్నట్టు సీసీ ఫుటేజీల్లో తేలింది. ఆ సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి హోటల్ బయట కారులోనే ఉన్నారు. మేనేజర్‌ను కారులో ఉన్న ఎమ్మెల్యే దగ్గరికి తీసుకెళ్లగా.. ఎమ్మెల్యే సైతం తీవ్ర పదజాలంతో దూషించినట్టు బాధితులు చెబుతున్నారు. 'ఎమ్మెల్యే అడిగితే సూట్‌రూం ఇవ్వవా.. నీకెంత ధైర్యంరా.. ఏమనుకుంటున్నావ్ నా గురించి' అంటూ తిట్టడమే కాకుండా ఇకపై హోటల్ ఎలా నడుపుకుంటారో చూస్తా అంటూ బెదిరించినట్లు తెలిసింది. నాలుగేళ్ల పాటు సూట్‌రూమ్ ఫ్రీగా ఇవ్వాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం.

ఫుడ్ సేఫ్టీ అధికారులు రంగంలోకి..

పోలీసుల సోదాలు ముగిసిన తర్వాత ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఎమ్మెల్యే నుంచి ఫోన్ వెళ్లింది. దీంతో ముగ్గురు ఆ శాఖ అధికారులు హోటల్‌లో సోదాలకు వెళ్లారు. కిచెన్‌లో ఆహార పదార్థాలను పరిశీలించారు. చికెన్ నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను ల్యాబుకు పంపిస్తున్నట్టు ఓ అధికారి పేర్కొన్నారు. ఇక.. మరుసటి రోజు అంటే బుధవారం ఉదయాన్నే మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఉసిగొల్పినట్లు తెలిసింది. హోటల్ భవన నిర్మాణం అక్రమంగా ఉందని, తనిఖీలకు వెళ్లాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ విషయం నగరంలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గతంలో లిక్కర్ వ్యాపారి (సింధూర వైన్స్) పిట్టు రామలింగారెడ్డిపై కూడా దగ్గుపాటి ప్రసాద్ దాడికి యత్నించారనే ఆరోపణలు ఉన్నాయి.

పది నిమిషాల్లోనే పోలీసుల రైడింగ్

ఈ ఘటన జరిగిన పది నిమిషాల్లోనే ఎమ్మెల్యే.. టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు ఫోన్ చేసి హోటల్‌పై రైడ్ చేయాలని ఆదేశించడంతో ఒక్కసారిగా పోలీసులు హోటల్‌కు చేరుకున్నారు. ప్రతి రూము గాలించారు. చిన్న తప్పు కనిపించినా కేసు బుక్ చేయాలని శతవిధాలా యత్నించారు. అయితే, చివరకు ఏ లోపం కనిపించకపోవడంతో పోలీసులు ఇదే విషయాన్ని ఎమ్మెల్యేకు చెప్పారు. తొలుత హోటల్‌లో రైడ్ చేయలేదని చెప్పిన సీఐ శ్రీకాంత్ యాదవ్.. మళ్లీ కొద్ది సేపటికే అన్ని హోటళ్లలాగే ఇక్కడ చేశామని 'సాక్షి'తో చెప్పడం గమనార్హం.

ప్రభుత్వ నిర్ణయాలతో హంద్రీ–నీవాకు ప్రమాదం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

- దురుద్దేశపూర్వకంగానే 3,850 క్యూసెక్కులకు కుదించారు
- కాలువ బలోపేతంపై సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలి
- ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వ

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో హంద్రీ–నీవాకు ప్రమాదం ముంచుకొస్తోందని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లా పరిస్థితులను సీఎం చంద్రబాబు మానవత్వంతో పరిశీలించి, రాయలసీమ జిల్లాలకు నీరందించే హంద్రీ–నీవాను బలోపేతం చేయాలన్నారు. జిల్లాకు 65 టీఎంసీల నీరు అవసరం ఉందని, ఆ మేరకు హంద్రీ–నీవాను 6,300 క్యూసెక్కులకు వెడల్పు చేయాలన్నారు. గాలేరు–నగరి నీటిని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2009లో దివంగత నేత వైఎస్సార్ హయాంలో పనులు వేగవంతంగా జరిగాయన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ–నీవా ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చేలా రూ.6,018 కోట్లతో టెండర్లను పిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఆ పనులు కొనసాగించి ఉంటే మరో రెండున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు అంది ఉండేవన్నారు. అలాగే, రూ.5 వేల కోట్లతో గాలేరు–నగరిని హంద్రీ–నీవాతో అనుసంధానించాలని నిర్ణయం తీసుకుని రూ.1,500 కోట్లు ఖర్చు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు దురుద్దేశపూర్వకంగా పాత జీఓలను రద్దు చేసి కేవలం 3,850 క్యూసెక్కులకు హంద్రీ–నీవాను కుదించి అన్యాయం చేశారన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుని, ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. హంద్రీ–నీవా ఫేజ్ 2 లైనింగ్ పనులను జిల్లా ప్రజలు అంగీకరించడం లేదన్నారు. లైనింగ్ టెండర్లు సీఎం చంద్రబాబు తన అస్మదీయులకు అప్పగించారని, రూ.743.85 కోట్లకు టెండర్లు పిలిచి దాదాపు రూ.200 కోట్ల ఎక్సెస్‌తో రూ.936.70 కోట్లకు కట్టబెట్టారని దుయ్యబట్టారు. జీడిపల్లి రిజర్వాయర్ కోసం భూములిచ్చిన 645 మంది రైతులకు రూ.10 లక్షల ప్రకారం ఒక ప్యాకేజీ సిద్ధం చేసి ఉందని, ఆ మేరకు పరిహారం ఇచ్చి జీడిపల్లిని పునర్నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఉంతకల్లు, వజ్రకరూరు చెరువులకు నీరందించడానికి సంబంధించి కూడా చంద్రబాబు ప్రకటన చేయాలన్నారు. చేనేతకు సంబంధించి ఉరవకొండ పెద్ద కేంద్రమని 'విశ్వ' గుర్తు చేశారు. గతంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు పనులు మొదలైనా సాంకేతిక సమస్యల కారణంగా ఆగిపోయాయని, ఈ విషయంపైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధాని పేరుతో వెనుకబడ్డ ప్రాంతాలను విస్మరించడం తగదన్నారు. 11 నెలల్లోనే రూ.1.65 లక్షల కోట్ల అప్పు చేసి ఆ భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాసినేని నరేష్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గోవింద్ నాయక్, కూడేరు మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంతటా.. అలర్ట్

దేశ సరిహద్దులో ఏర్పడిన అలజడి నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఉగ్రవాద దాడులు జరిగితే ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి, ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అందులో భాగంగానే బుధవారం పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయంలో స్పెషల్ పార్టీ పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించిన దృశ్యమిదీ.

– సాక్షి నెట్‌వర్క్



ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం అండేపల్లిలో బుధవారం ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేపట్టారు. గ్రామంలో నెల కొన్న తాగునీటి సమస్యపై రెండు రోజుల క్రితం స్థానికులు రోడ్డెక్కారు. కంబదూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అధికార యంత్రాంగం తీరుపై మండిపడ్డారు. దీనిపై 'సాక్షి'లో 'తారస్థాయికి దాహం కేకలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో స్పందించిన కంబదూరు మేజర్ పంచాయతీ సర్పంచు పద్మావతమ్మ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆమె కుమారుడు, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ సాకే గంగాధర్ తన సొంత నిధులతో అండేపల్లిలో నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్లుప్తంగా

తాడిపత్రికి చేరుకునే నిర్ణయం వాయిదా వేయండి

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఎస్పీ జగదీష్ లిఖితపూర్వక అభ్యర్థన

అనంతపురం: హైకోర్టు ఆదేశాలను అనుసరించి ఈ నెల 8న కుటుంబసభ్యులతో కలిసి తాడిపత్రికి వెళ్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదే విషయాన్ని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్‌ను మంగళవారం పెద్దారెడ్డి కలసి హైకోర్టు ఉత్తర్వులు చూపి తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ వినతిపై ఎస్పీ పి. జగదీష్ బుధవారం స్పందిస్తూ తాడిపత్రికి 8న చేరుకునే నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని సూచిస్తూ లేఖ రాశారు. ఈ నెల 9న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో మొత్తం భద్రతా సిబ్బంది అక్కడ విధుల్లో పాల్గొంటున్నారని, దీంతో 8వ తేదీ తర్వాత మరో రోజు నిర్ణయించుకుని తెలిపితే సరైన భద్రత కల్పిస్తామని లేఖలో పేర్కొన్నారు.

ముష్కరులపై పోరుకు నేను సైతం..


మాజీ జవాన్ అమర్‌నాథ్

కళ్యాణదుర్గం: ముష్కరులను తుదముట్టించే దిశగా ప్రస్తుతం పాకిస్తాన్‌తో మొదలైన యుద్ధంలో పాల్గొనేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఆర్మీ ఉన్నతాధికారులకు మాజీ జవాన్, కళ్యాణదుర్గం నియోజకవర్గ సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చేకూరి అమర్‌నాథ్ లేఖ రాశారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ముష్కరులపై సాగిస్తున్న ఈ యుద్ధంపై ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉగ్రవాదులు, వాళ్లకు సహకరించిన వాళ్లను భూమ్మీద లేకుండా చేసే పనిని త్రివిధ దళాలకు కేంద్రం అప్పగించిందన్నారు. ఇది ఒక విధంగా మిలటరీ వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చే నట్లేనని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సమయంలో తాను సర్వీసులో ఉండి ఉంటే ఎంతో గర్వంగా అనుభూతి చెందేవాడినని అన్నారు. యుద్ధంలో పాల్గొనే సైనికులకు అవసరమైన సహాయం, అవసరమైతే యుద్ధంలో పాల్గొనేందుకూ తాను సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఆర్మీ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు.

త్రివిధ దళాల హుండీల లెక్కింపు

అనంతపురం: సాయుధ త్రివిధ దళాల పతాక దినోత్సవ సందర్భంగా వివిధ సంస్థలు, పాఠశాలలు, కళాశాలల నుంచి సేకరించిన విరాళాల హుండీ బాక్స్‌లను బుధవారం కలెక్టర్ నియమించిన కమిటీ సమక్షంలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో లెక్కించారు. మొత్తం 75 హుండీల ద్వారా రూ.1,09,710 నగదు, దాతల నుంచి రూ.3,76,992 కలిపి మొత్తం రూ.4,86,702 నగదు అందినట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి. తిమ్మప్ప తెలిపారు. ఈ మొత్తాన్ని లు త్రివిధ సాయుధ దళాల పతాక బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు వివరించారు.

వేగం.. సులభం.. సురక్షితం!

- డిజిటల్ మనీతో దూరమైన నగదు ఇక్కట్లు
- స్మార్ట్‌ఫోన్ ద్వారా క్షణాల్లో నగదు చెల్లింపులు
- కిళ్లీ కొట్టు మొదలు.. షాపింగ్‌మాల్ వరకూ అంతా డిజిటల్ చెల్లింపులే


పండ్ల వ్యాపారి వద్ద క్యూర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ మనీ పంపుతున్న కొనుగోలుదారుడు

రాయదుర్గం టౌన్: జేబులో రూ.500 నోటు పెట్టుకుని దుకాణానికి వెళ్లడం.. నచ్చిన వస్తువు కొనుగోలు చేసిన తర్వాత చిల్లర సమస్యతో సతమతమవడం.. ఇది నిన్నామొన్నటి వరకూ ప్రజలు పడిన ఇబ్బందులు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని డిజిటల్ మనీ రూపాంతరం చెందడంతో ఈ ఇబ్బందికి చెక్ పడింది. ఈ లావాదేవీలు వేగంగా, సులభంగా, సురక్షితంగా జరుగుతుండడంతో అందరూ వీటిపై ఆకర్షితులయ్యారు. దీంతో చిన్నపాటి కిళ్లీ కొట్టు మొదలు... షాపింగ్ మాల్స్ వరకూ ఎటు చూసినా డిజిటల్ పేమేంట్‌లు ఊపందుకున్నాయి. ఎటు చూసినా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం క్యూ ఆర్ కోడ్లు కనిపిస్తున్నాయి.

చిటికెలో చెల్లింపులు

జిల్లాలో దాదాపు రెండు లక్షలకు పైగా వ్యాపార సముదాయాలున్నాయి. కిరాణాకొట్లు, కిళ్లీ బంకులు, వస్త్ర దుకాణాలు, మెడికల్ షాపులు.. చివరికి బస్సులు, రైళ్లలో ప్రయాణాలకు సైతం డిజిటల్ మనీని స్వీకరిస్తున్నారు. మరికొన్ని చోట్ల కార్డు స్వైపింగ్ కోసం పీఓఎస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రజలు తమ ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లలో యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని చిటికెలో చెల్లింపులు జరుపుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా జిల్లాలో రోజూ రూ.100 కోట్లకు పైగా చెల్లింపులు జరుగుతున్నట్లు అంచనా.

చిల్లరతో పనేదీ?

గతంలో రూపాయి, రెండు, ఐదు రూపాయల కాయిన్లకు డిమాండ్ ఉండేది. హోటళ్లు, కిరాణా దుకాణాల్లో అవసరమున్న చిల్లర లభ్యత కాగా కొనుగోలుదారులు ఇబ్బంది పడేవారు. దీంతో వ్యాపారులు రూ.10 కమీషన్ చెల్లించి వంద రూపాయలకు చిల్లర తీసుకునే వారు. ఒకప్పుడు ఈ తరహా వ్యాపారం జిల్లాలో భారీగా జరిగేది. ప్రస్తుతం ఆన్‌లైన్ చెల్లింపుల కారణంగా చిల్లర అవసరాలు పూర్తిగా తగ్గాయి.

లెక్క లేకుండా ఖర్చు

డిజిటల్ మనీ వ్యాప్తిలోకి వచ్చాక ఎంత మేలు జరుగుతుందో.. అంతే నష్టం పొంచి ఉంది. గతంలో జేబులో ఉన్న డబ్బును ఎంత వరకు అవసరమో అంత మేరకే వినియోగించేవారు. అయితే ప్రస్తుతం వచ్చిన నగదు చెల్లింపుల యాప్‌లతో ఎంత వెచ్చిస్తున్నామనే అంశంపై అవగాహన ఉండడం లేదు. క్రెడిట్ కార్డుల్లో ఉన్న మొత్తంతో పాటు ఓవర్ లిమిట్ సౌకర్యాన్ని సైతం కల్పిస్తుండడంతో షాపింగ్‌లు, సినిమాలు, షికార్లకు యువత ప్రాధాన్యత నిస్తున్నారు. డబ్బులను తిరిగి బ్యాంకులకు చెల్లించాల్సిన సమయం వచ్చినప్పుడు ఒత్తిడికి లోనవుతున్నారు. దీంతో ఆత్మహత్యలకు పాల్పడిన ఉదంతాలూ ఉన్నాయి. దీంతో డిజిటల్ మనీ లావాదేవీల విషయంగా అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

మోసపూరిత లింకులు, సైబర్ కేటుగాళ్లతో జాగ్రత్త

ఆన్‌లైన్ చెల్లింపులు ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో... అంతే వేగంగా సైబర్ మోసగాళ్లు వల విసురుతున్నారు. లింకులను పంపి వాటిని క్లిక్ చేయాలని సూచిస్తున్నారు. అవగాహన లేని కొందరు వాటిని క్లిక్ చేయగానే వారి బ్యాంక్ ఖాతాల్లోని నగదును అప్పనంగా కాజేస్తున్నారు. ఇలాంటి మోసపూరిత లింకులు, సైబర్ కేటుగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

పోలీసుల తీరు మారాలి


మాట్లాడుతున్న అనంత వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) మెట్టు గోవిందరెడ్డి, తలారి రంగయ్య

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, సమన్వయకర్తలు మెట్టు, రంగయ్య

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించే విషయంలో పోలీసుల తీరు పూర్తిగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, రాయదుర్గం, కళ్యాణదుర్గం సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, తలారి రంగయ్య అన్నారు. బుధవారం రాయదుర్గంలో పార్టీ నాయకులతో కలసి వారు మాట్లాడారు. పోలీసు వ్యవస్థపై తమకు అపార గౌరవం ఉందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాప్తాడు పర్యటనలో పోలీసుల భద్రత వైఫల్యం స్పష్టంగా కనిపించిందన్నారు. ఈ అంశంపై తమ పార్టీ నాయకులపైనే అక్రమ కేసులు బనాయించడం సరైందికాదన్నారు. ఇటీవల రాయదుర్గంలోనూ వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు నమోదు చేసి వివాదానికి కారణమయ్యారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలలవుతోందని, సీఎం చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బాబు పాలనలో స్కీములు తక్కువ స్కాములు ఎక్కువయ్యాయని ఎద్దేవా చేశారు.

కార్మికుడి బలవన్మరణం

రాయదుర్గం టౌన్: స్థానిక కణేకల్లు రోడ్డులో నివాసముంటున్న ఉంటున్న గార్మెంట్స్ పరిశ్రమ కార్మికుడు వడ్డే రవి(37) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య సునీత, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మెప్మా విభాగంలో ఆర్‌పీగా సునీత పని చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా తాగుడుకు బానిసైన రవి పనికి సక్రమంగా వెళ్లకుండా మద్యం మత్తులో ఉండేవాడు. దీంతో బంధువులు మందలించడంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

'అనంత' అభివృద్ధే లక్ష్యం కావాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 మంది ఎంపీడీఓలకు మండలాల కేటాయింపు


పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న ఎంపీడీఓలతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీసీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: విధి నిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తూ.. జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని నూతనంగా పోస్టింగ్ అందుకున్న ఎంపీడీఓలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పని చేస్తున్న పది మంది పరిపాలనాధికారులు, డిప్యూటీ ఎంపీడీఓ (ఈఓఆర్‌డీ)లతో పాటు నంద్యాల నుంచి ముగ్గురు, కర్నూలు నుంచి ఇద్దరు అధికారులకు రెగ్యులర్ ఎంపీడీఓలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పదోన్నతిపై వచ్చిన 15 మందిలో 10 మందిని శ్రీసత్యసాయి జిల్లా, ఐదుగురిని అనంతపురం జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి మండలాలు కేటాయిస్తూ బుధవారం తన చాంబర్‌లో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో కలసి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఉత్తర్వులు అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండగా, 15 మంది వచ్చారని, త్వరలో మిగిలిన పోస్టులు కూడా భర్తీ అవుతాయని డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్లానింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఏఓలు రత్నాబాయి, నియాజ్ అహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ లీలావతి పాల్గొన్నారు.

మండలాల వారీగా నియమితులైన ఎంపీడీఓలు

మండలం	ఎంపీడీఓ
తలుపుల	నసీమ
సోమందేపల్లి	వెంకటలక్ష్మమ్మ
తనకల్లు	ఐ.మమతాదేవి
పరిగి	రెడ్డెప్ప
నంబులపూలకుంట	ఆర్.పార్థసారథి
చిలమత్తూరు	జి.కరుణసాగర్
చెన్నేకొత్తపల్లి	ఎం.బాలకృష్ణుడు
రొళ్ల	వై.నాగేశ్వరశాస్త్రి
గుడిబండ	పి.కేశవరెడ్డి
కొత్తచెరువు	ఏజీ నటరాజ్
కళ్యాణదుర్గం	వి.ధనుంజయనాథ్
బ్రహ్మసముద్రం	వి.విజయసింహారెడ్డి
కంబదూరు	ఎం.సూర్యనారాయణ
వజ్రకరూరు	వి.శివాజీరెడ్డి
శెట్టూరు	టి.జిలాన్‌బాషా

అప్పులు తీర్చే మార్గం కానరాక వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: బిడ్డల చదువుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... తాటిచెర్ల–అనంతపురం రైల్వే స్టేషన్ల మధ్యలో పట్టాలపై ఛిద్రమైన ఓ పురుషుడి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అక్కడ లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని అనంతపురంలోని వినాయకనగర్‌లో నివాసముంటున్న రొళ్ల నాగరాజు (45)గా గుర్తించారు.కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని మృతుడిని నాగరాజుగా నిర్ధారిస్తూ బోరున విలపించారు. వెల్డింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకున్న ఆయన సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని వివరించారు. కాగా, నాగరాజుకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరి చదువుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి తీర్చలేని స్థాయికి చేరుకుంది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదన పడుతూ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

తీరనున్న 'డైట్' అధ్యాపకుల కొరత

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డైట్)లో అధ్యాపకుల కొరత తీరనుంది. ముగ్గురు సీనియర్ అధ్యాపకులు, ఆరుగురు అధ్యాపకులను ఫారెన్ సర్వీస్ కింద నియమిస్తూ పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అధ్యాపకులుగా అమడగూరు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పి.శ్రీధర్‌బాబు, రొద్దం మండలం తురకలాపట్నం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పెనుకొండ శివరాం, గుమ్మఘట్ట మండలం పూలకుంట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం అవులపల్లి అస్లాంబాషాను నియమించారు. అధ్యాపకులుగా కణేకల్లు బాలుర జెడ్పీహెచ్‌ఎస్ బీఎస్ టీచరు వేలూరు లక్ష్మీనరసింహ, కొత్తచెరువు మండలం చెన్నరావుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఇంగ్లిష్ టీచరు లింగుట్ల రమేష్‌నాయుడు, పరిగి మండలం పి.నరసాపురం జెడ్పీహెచ్‌ఎస్ ఇంగ్లిష్ టీచరు బైరప్పగారి ఆదర్శ్, రామగిరి మండలం పేరూరు జెడ్పీహెచ్‌ఎస్ గణితం టీచరు మైలారి మాలతీదేవి, పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బీఎస్ టీచరు ఎస్‌పీ ప్రభాకర్, తలుపుల మండలం ఓబుళరెడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ బీఎస్ టీచరు పసల లోకనాథరెడ్డిని నియమించారు. డైట్ అధ్యాపకుల నియామకానికి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తు చేసుకున్న హెచ్‌ఎంలు, టీచర్లకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. మెరిట్ ఆధారంగా జాబితా రూపొందించి కలెక్టర్ సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫైనల్ జాబితాను ఎంపిక చేసి ఆమోదం కోసం కమిషనర్‌కు పంపారు. ఈ క్రమంలో కమిషనర్ ఆమోదముద్ర వేశారు. ఎంపికైన వారందరూ గురువారం బాధ్యతలు చేపట్టనున్నారని డీఈఓ ప్రసాద్‌బాబు వెల్లడించారు.

పార్టీ నుంచి ఇద్దరి సస్పెన్షన్

కళ్యాణదుర్గం: పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడిన కంబదూరు మండలానికి చెందిన మాజీ ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ, పార్టీ జిల్లా బీసీ విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి ములకనూరు గోవిందును వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఉపాధి పథకంలో అవినీతి



బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు పంచాయతీ నీలారెడ్డిపల్లిలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టీడీపీ కార్యకర్త గంగాధర్ అవినీతిపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ప్రజా ప్రతినిధి అండ చూసుకుని తాను ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని భావించిన ఆయన గ్రామంలో ఒక్కో కూలీలో రూ.150 చొప్పున అక్రమంగా వసూలు చేస్తుండడం అదే పార్టీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టులు రికార్డు చేసి వైరల్ చేయడం గమనార్హం. రూ.150 చెల్లిస్తే రూ.1,800 కూలి పడేలా చేస్తామంటూ 150 మంది కూలీలతో వారానికి రూ.22,500 వేలు చొప్పున నెలకు రూ.లక్షకు పైగా టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఇద్దరూ కుమ్మక్కై అక్రమ వసూళ్లకు తెరలేపిన విషయం కాస్త బహిర్గతం కావడంతో వారు స్వీయరక్షణలో పడ్డారు. దీంతో ఎవరూ డబ్బు వసూలు చేయడం లేదని ఇటీవల విచారణ చేపట్టిన ఉపాధి సిబ్బంది ఎదుట తమకు అనుకూలమైన కూలీలతో చెప్పించి సంతకాలతో కూడిన లేఖలు అందజేయించినట్లుగా తెలిసింది.

వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్‌పై దాడి


గాయపడిన వన్నూరుస్వామి

ఉరవకొండ: మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బోయ వన్నూరుస్వామిపై టీడీపీ నాయకులు కట్టెలతో దాడి చేశారు. బాధితుడు తెలిపి మేరకు... 1930 నుంచి సర్వే నెంబర్ 416లో భూమిని వన్నూరుస్వామి పూర్వీకులు సాగు చేసుకునే వారు. ఆయనకు సమీప బంధువైన వట్టి సుంకన్న కుమారుడు ముత్యాలప్ప 2019లో 2.84 ఎకరాల సాగు భూమిని పాల్తూరు గ్రామానికి చెందిన మారెయ్యకు విక్రయించాడు. మిగులు భూమిలో వెళ్లేందుకు మారెయ్యకు అమ్మిన భూమి నుంచి ఉన్న రస్తా గుండా రాకపోకలు సాగించకుండా ఆయన కుటుంబ సభ్యులు అడ్డుకునేవారు. ఈ క్రమంలో బుధవారం తన పొలానికి వెళుతున్న వన్నూరుస్వామిని బొమ్మశెట్టి, ముత్యాలు అడ్డుకుని కట్టెలతో దాడి చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పందుల పెంపకందారుడిపై కత్తులతో దాడి


గాయపడిన మొండి బాలరాజు

పామిడి: స్థానిక సంతమార్కెట్ వీధిలో బుధవారం సాయంత్రం పందుల పెంపకందారుడు మొండి బాలరాజుపై దొంగ శివ బృందం కత్తులతో దాడి చేసింది. బాలరాజుకు తలకు, చేతులకు, ఛాతీపై తీవ్ర రక్త గాయాలయ్యాయి. కొన్ని రోజులుగా పందుల తరలింపుపై దొంగ శివ బృందం, పందుల పెంపకందారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇరు వర్గాలపై కేసులూ ఉన్నాయి. పందులను అక్రమంగా తరలించకుండా బాలరాజు అడ్డుపడుతున్నాడనే అక్కసుతో బుధవారం కత్తులతో దాడికి తెగబడ్డారు. క్షతగాత్రుడిని స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హంద్రీ-నీవాను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలి

- శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి డిమాండ్



ఉరవకొండ: హంద్రీ–నీవా కాలువను 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వితే 2,200 క్యూసెక్కులు మాత్రమే వస్తాయని, అలా కాకుండా 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వానికి శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి సూచించారు. వజ్రకరూరు మండలం ఛాయపురంలో సీఎం పర్యటన నేపథ్యంలో ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.68 టీఎంసీల మాత్రమే నీటిని నిల్వ చేస్తున్నారన్నారు. దీని సామర్థ్యాన్ని 4 టీఎంసీలు చేయడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.675 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసిందన్నారు. ఈ ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం ఆమోదిస్తే రాయలసీమకు తాగు, సాగునీరు అందుతుందన్నారు. హంద్రీనీవా ద్వారా 70 నుంచి 80 టీఎంసీల వరకు నీటిని తీసుకోరావాలంటే కాలువను మరింత వెడల్పు చేయాలన్నారు. లైనింగ్ పనులతో ఉమ్మడి జిల్లాకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

కోడిని తిన్న కుక్క... పలువురిపై కేసు నమోదు

యాడికి: మండలంలోని నిట్టూరు గ్రామంలో రెండు రోజుల క్రితం పెంపుడు కోడిని ఓ కుక్క తినింది. దీంతో చోటు చేసుకున్న ఘర్షణలో పుల్లయ్య కుమారుడు వీరాంజనేయులును అదే గ్రామానికి చెందిన రాధక్క, అరుణ్, రామాంజనేయులు చితకబాదారు. ఘటనపై బాధితుడు బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు రాధక్క, అరుణ్, రామాంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే తనపై పుల్లయ్య, వీరాంజనేయులు, మల్లేశ్వరి దాడి చేసి కొట్టారంటూ బాధిత రాధమ్మ చేసిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందాలి

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ


మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

బుక్కరాయసముద్రం: రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందేలా చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ సూచించారు. బీకేఎస్ మండలం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని రైతాంగానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. పంటల సాగులో మెలకువలు, సూచనలు సలహాలు నిరంతరం అందించాలన్నారు. అనంతరం పలువురు శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రైతాంగ పంటల సాగు, వివిధ రకాల పంటలలో యాజమాన్య పద్ధతులపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ జాన్సన్, ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, రేకులకుంట పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ విజయశంకర్‌బాబు, రెడ్డిపల్లి ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర పాల్గొన్నారు.

రేపటి నుంచి పెన్నహోబిలంలో బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు బుధవారం వెల్లడించారు. 9న శ్రీవారి ఉత్సవమూర్తులను ఆమిద్యాల గ్రామం నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తారు. 10న ప్రాకారోత్సవం, 11న సింహ వాహనం, చంద్రప్రభ ఉత్సవాలు ఉంటాయి. 12న గోవాహన సేవ, శేషవాహనోత్సవం, 13న హంసవాహనం, 14న హనమంత వాహన సేవలు, 15న గరుడ వాహనోత్సవం ఉంటాయి. అదే రోజు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 16న సూర్యప్రభ ఉత్సవం, ఐరావత వాహనోత్సవం, 17న ఉదయం రథోత్సవం, సాయంత్రం ధూళోత్సవం, 18న అశ్వ వాహనం, 19న ధ్వజారోహణం, శయనోత్సవం ఉంటాయి. 20న శ్రీవారి ఉత్సవ మూర్తులను ఆమిద్యాల గ్రామానికి చేర్చడంతో ఉత్సవాలు ముగుస్తాయి.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం (ఇన్‌సెట్‌లో) అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

క్లుప్తంగా

20న గ్రామీణ హర్తాల్



హర్తాల్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలను నిరసిస్తు ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ హర్తాల్‌ను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాసంఘాల జిల్లా కార్యదర్శులు నల్లప్ప, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, బాలరంగయ్య మాట్లాడారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ అదానీ, అంబానీ వంటి కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన సాగిస్తోందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామ, మండల కేంద్రాల్లో (గ్రామీణ హర్తాల్) ర్యాలీలు, ప్రదర్శనలు, రాస్తారోకో, తదితర రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శివ, వెంకటేషులు, భాస్కర్, చెన్నారెడ్డి, రాయుడు, రాజా, రామిరెడ్డి, శ్రీనివాసులు, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇవ్వాలి



ఎస్కేయూ వీసీ అనితకు వినతిపత్రం అందజేస్తున్న టైం స్కేల్ ఉద్యోగులు

అనంతపురం: ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో టైం స్కేల్ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన బి.మహబూబ్ బాషా మార్చి 29న అనారోగ్యంతో మరణించారు. కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని టైం స్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. బుధవారం ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ బి.అనితను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టైం స్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు కే.చంద్రశేఖర్ నాయుడు, బి.శివయ్య, హెచ్‌బీ సంజీవప్ప, కే.రమేష్, బి.నారాయణప్ప, జి.నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ పోస్టులు పెంచాలి



అభ్యర్థులతో కలిసి నిరసన తెలియజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ ప్రిపరేషన్‌కు 90 రోజుల సమయం ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక 2వ రోడ్డు స్టడీ పార్క్ వద్ద నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. సిలబస్ ఎక్కువ ఉండటంతో అభ్యర్థులు చదువుకునేందుకు గడువు పెంచాలని కోరారు. అలాగే అనంతపురం జిల్లాకు ఎస్జీటీ పోస్టులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. 'ఒకే జిల్లా–ఒకే పరీక్ష పేపర్' ఉండాలన్నారు. వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని సూచించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ మార్కులు 40 శాతానికి తగ్గించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లికి చెందిన వృద్ధురాలు యల్లమ్మ (65) చికిత్స పొందుతూ మృతి చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాముడు, యల్లమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. యల్లమ్మ 20 ఏళ్లుగా మూర్ఛ వ్యాధి, బీపీ, షుగర్ తదితర రోగాలతో బాధపడుతోంది. ఎన్నిచోట్ల చూపించినా నయం కాలేదు. ఇంకా చూపించుకున్నా పిల్లలకు డబ్బులు వృథా అవుతాయని భావించిన ఆమె మనస్తానికి గురై ఈనెల 1న ఇంట్లో అందుబాటులో ఉన్న అన్నిమాత్రలు కలిపి ఒకే మారు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సాహితీ సంబరాలకు రండి

అనంతపురం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈనెల 10, 11 తేదీల్లో ఏలూరు వేదికగా సాగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు తరలిరావాలని కవులు పిలుపునిచ్చారు. ఏలూరులోని శ్రీమహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని గుత్తా హరిసర్వోత్తమ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేలకొరిగిన బోర్డులు..



ఆత్మకూరు మండల కేంద్రానికి సమీపంలో బైపాస్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు పడిపోయాయి. ఇటీవల గుర్తు తెలియని వాహనాలు బోర్డులను ఢీకొనడంతో నేలకూలాయి. మలుపులు, కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు కనిపించక పోవడంతో రహదారిపై అతివేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు, పంచాయతీ అధికారులు బోర్డుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రమాద హెచ్చరికల బోర్డులను తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నేలకూలిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

– ఆత్మకూరు:



ఆత్మకూరు బైపాస్‌లో పడిపోయిన హెచ్చరిక బోర్డు

వృథాగా ప్రభుత్వ భవనం

చెన్నేకొత్తపల్లిలో ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయం



చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో పాత ఎంపీడీఓ భవనం వృథాగా దర్శనమిస్తోంది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇప్పుడు భవనం పైకప్పు దెబ్బతినడంతో పూర్తిగా వదిలేశారు. పట్టణం నడిబొడ్డులో విశాలమైన ప్రాంతంలో ఈ భవనం ఉంది. గత కొన్నేళ్ల క్రితం వరకూ ఇందులో ఎంపీడీఓ కార్యాలయం ఉండేది. కొత్త భవనం నిర్మించడంతో అందులోకి ఎంపీడీఓ కార్యాలయాన్ని మార్చారు. అప్పటి నుంచి ఈ భవనం బిచ్చగాళ్లకు నిలయంగా మారింది. ఈ భవనంలో చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. ఈ భవనానికి మరమ్మతులు చేసి ఉపయోగించుకుంటే బాగుంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. – చెన్నేకొత్తపల్లి:

ఆగిన నిర్మాణం.. తప్పని వ్యథ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. అంగన్‌వాడీ చిన్నారులు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో మగ్గుతున్నారు. మండలంలో నాడు–నేడు కార్యక్రమం కింద మామిళ్లపల్లి, ముత్తువకుంట్ల, మద్దెలచెరువు గ్రామాలకు అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలు కూడా ప్రారంభించి 60 శాతం పనులు కూడా పూర్తి చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. భవనాలు నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

– కనగానపల్లి:



మామిళ్లపల్లిలో అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

ఆర్డీటీని నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీపై విధించిన ఆంక్షలను తక్షణం ఎత్తివేయాలని మేయర్ వసీం డిమాండ్ చేశారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ ఫెర్రర్ విగ్రహం వద్ద చేపటిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. మేయర్ వసీంతో పాటు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, చామలూరు రాజగోపాల్ తదితరులు దీక్షలకు మద్దతు తెలిపారు. అనంతరం మేయర్ వసీం మాట్లాడుతూ.. ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. ఆర్డీటీపై ఆంక్షలు విధిస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విదేశీ నిధులు రాకుండా ఆపివేయడం చూస్తుంటే పథకం ప్రకారమే కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, మల్లెమీద నరసింహులు, అనిల్ కుమార్‌రెడ్డి, కమలభూషణ్, అఖిల పక్ష కమిటీ నాయకులు సాకే హరి, తరిమెల రాజు, గోవిదప్ప, శివశంకర్, రామకృష్ణా రెడ్డి, ఆనంద్, హరినాథ్‌రెడ్డి, రామాంజనేయులు, చంద్రచర్ల హరి, ఉరుముల రాము, రాజేష్, వసంతకుమార్, గోవర్ధన్, రామకృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ర్యాలీ..

అనంతపురం అర్బన్: పేదలకు అండగా నిలుస్తూ దళిత, గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్న ఆర్డీటీ సంస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దళిత ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆర్డీటీని కాపాడుకుందాం అంటూ బుధవారం స్థానిక దామోదర సంజీవయ్య భవన్ (పెన్నార్ భవన్) నుంచి దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్ వరకూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలంటూ కలెక్టరేట్ ఆవరణలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థ ప్రజలకు విశేష సేవలందిస్తోందన్నారు. పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందిస్తోందని తెలిపారు. వ్యవసాయానికి చేయూత, పక్కా గృహాల నిర్మాణం, మహిళ సాధికారత, ఇలా ఎన్నో రకాల సేవలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేపీ నారాయణ స్వామి, చిన్నపెద్దన్న, నెరమెట్ల ఎల్లన్న, మద్దిఓబులేసు, నగేష్, మీనుగ రామాంజనేయులు, కొర్రపాడు రమణ, చిన్న ఆంజనేయులు, ఈశ్వరయ్య, భాస్కర్,ఓబులేసు, రాఘవ, సంజీవులు, చెన్నంపల్లి ఓబులేసు, సత్యమయ్య, బళ్లారి ఎర్రిస్వామి, మండల పక్కీరప్ప, దిలీప్, నాగరాజు, కదిరప్ప, పుల్లన్న, నల్లప్ప, కొడన్న, మనోజ్, రామచంద్ర, కిష్టప్ప, రమేష్, ఆదిలక్ష్మి, సునీత, పోలమ్మ, చంద్రశేఖర్, నరసింహులు, రామాంజి, బుగ్గశివయ్య, మురళీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం



నినాదాలు చేస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

ఆర్డీటీని పరిరక్షించుకుందాం

అనంతపురం కార్పొరేషన్: కరువు జిల్లా ప్రజలకు అండగా నిలిచిన ఆర్డీటీని నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదు. ప్రజాస్వామ్య పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు ధ్వజమెత్తారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలకు దీటుగా ఆర్డీటీ పేదల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. విద్య, వైద్య అందించడంతో పాట మహిళల ఆర్థిక ప్రగతికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించినట్లు ఇచ్చినట్లు తెలిపారు. అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాలో భూగర్భ జలాల కోసం చెక్ డ్యాంలు నిర్మించినట్లు పేర్కొన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడినట్లు గుర్తు చేశారు. తక్షణం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

అనంతపురం: జీఓ నంబర్ 77ను రద్దు చేసిన తరువాతే సీఎం చంద్రబాబు నాయుడు జిల్లాలో అడుగుపెట్టాలి. లేదంటే సీఎం పర్యటనను అడ్డుకుంటామని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఐసెట్ పరీక్షను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఇటుకలపల్లి సీఐ హేమంత్ కుమార్ ఏబీవీపీ నాయకులను అడ్డగించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిన విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని.. జీఓ నంబర్ 77ను రద్దు చేస్తామని గతంలో లోకేష్ పాదయాత్రలో హామీ ఇచ్చారన్నారు. ఈ హామీలను అమలు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేస్తూ ఐసెట్ పరీక్షను అడ్డుకునే ప్రయత్నం చేశారు.



ఐసెట్ పరీక్షను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఫేక్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని నినాదాలు చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా పీజీ పరీక్షలు నిర్వహిస్తే ఎలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దివాకర్, సుధీర్, విజయ్, భూతరాజు, శివ్‌రాజ్, వంశీ, వెంకటేశ్, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ



నినాదాలు చేస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు



ఆత్మకూరులో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

అనంతపురం: భారత త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమానికి మద్దతుగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాలను ప్రదర్శించారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు మాట్లాడుతూ.. ఉగ్రవాదులు భారత పౌరులపై జరిపిన దాడికి ప్రతి దాడిగా భారత బలగాలు చేపట్టిన చర్యకు 140 కోట్ల భారతీయులు అండగా ఉండారని పేర్కొన్నారు. శత్రు వినాశం జరిగి మన సైనికుల సంపూర్ణ విజయాన్ని కాంక్షిస్తూ ర్యాలీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శంకర్, సురేష్, భరత్, నాగేంద్ర, ముని, రంజిత్, శాంతిరాజు, త్రిలోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: భారత సైనం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. బంధూక రవితేజ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున టపాసులు కాలుస్తూ, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రవాదుల గుండెల్లో భారత సైనికులు రైళ్లు పరిగెత్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్మకూరు యువత గోవర్ధన్, సందీప్, నరేష్, హనుమప్ప, సంజయ్, శ్రీధర్, నరేష్, ఈడిగ అనిల్, మంజు, చరణ్, హరి, పవన్, మురళి, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి



రాప్తాడు: ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా ఉత్సవాలు బుధవారం కనుల పండవగా జరిగాయి. స్థానిక రాణినగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, గణపతిపూజ, అలంకార సేవలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నెయ్యితో అఖండదీపం వెలిగించారు. మధ్యాహ్నం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం సర్వాంగ సుందరంగా అలంకరించిన పూలతేరుపై వీరబ్రహ్మేంద్రుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. నగరవీధుల్లో 108 మంది కన్యలు కలశాలతో శోభాయాత్రగా వచ్చి స్వామికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గురుప్రసాద్, గౌరవాధ్యక్షుడు నాగభూషణం, ఆలయ అధ్యక్షులు చంద్రమౌళి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కుర్లపల్లి రంగాచారి జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎస్ ప్రకాష్ ఆచారి, నాగజ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. గంగలకుంట, రామినేపల్లి, గొల్లపల్లి, మరూరు, ఎం.చెర్లోపల్లి, ఎం.బండమీదపల్లి, అయ్యవారిపల్లి, ప్రసన్నాయపల్లి, లింగనపల్లి, బోమ్మేపర్తి, పుల్లలరేవు, గాండ్లపర్తి, జి.కొత్తపల్లి, బుక్కచెర్ల తదితర గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భం ఆలయ గౌరవాధ్యక్షుడు గౌరవ ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడు శీల్ల నడిపి తిమ్మప్ప మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. హంపాపురంలోని మౌనగిరిక్షేత్రంలో ఆరాధన జరిగింది.

'ఆపరేషన్ సింధూర్‌ను స్వాగతిస్తున్నాం'

• మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: ఉగ్రవాదులపై ప్రతీకార చర్యల్లో భాగంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను స్వాగతిస్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పహల్గాంలాంటి ఘటన మరొకటి జరగకుండా తగిన గుణపాఠం చెప్పారన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారు. ముంబై, పుల్వామా, ఊరి, పఠాన్ కోట్, పెహల్గాం దాడులతో తాము చూస్తూ ఊరుకోమని తగిన సమాధానం చెబుతామని భారత్ బలమైన సమాధాన్ని చెప్పిందన్నారు. భారత్ ఆర్మీలోని ప్రతి సైనికునికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మేరా భారత్ మహాన్ జై హింద్ అంటూ నినాదాలు చేశారు.

కొనసాగుతున్న సమ్మె

అనంతపురం మెడికల్: ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల సమ్మె 10వ రోజుకు చేరుకుంది. బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల అసోసియేషన్ నాయకులు గౌరి, అనూష, రాజేశ్వరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. ఉద్యోగ భద్రతపై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శివరాం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

జగమునేలు జగజ్జనని పాహిమాం



అమ్మవారి కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

• నేత్రపర్వంగా వాసవీమాత జయంతి

ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు బుధవారం నేత్రపర్వంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, నగరోత్సవాలు, ఊంజల సేవలు కాట్టుకున్నాయి. కొత్తూరు, పాతూరులోని వాసవీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు బారులుదీరి వాసవీ మాతను దర్శించుకున్నారు. ఉదయం ఆర్యవైశ్య హాస్టల్‌లో పతాకావిష్కరణ జరిగింది. వాసవి జయంతి విశిష్టతను కొత్తూరు అమ్మవారి శాల అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు తెలియజేశారు. శోభాయమానంగా అలంకరించిన పూల తేరుపై అమ్మవారిని రాజు రోడ్డు మీదుగా భజన సంకీర్తనలు, మంగళవాయిద్యాల నడుమ ఆర్యవైశ్య హాస్టల్ వరకూ ఊరేగించారు. వందలాది మంది యువతులతో కలసి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కలశం మోశారు. రుత్విక్కులు జరిపించిన వాసవీ హోమం, వాసవీ మాతకు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం, అన్నవితరణ జరిగాయి. రాత్రి ఊంజల సేవ ఘనంగా జరిగింది. పాతూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. పిన్ను నాగరత్నం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాసవీ హోమం నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారి రథం ముందు మహిళలు కోలాటం ఆడారు. పలువురు భక్తిగీతాలు పాడుతూ సందడి చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. – అనంతపురం కల్చరల్:



అలంకరణలో వాసవీ మాత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



పాతూరులో వాసవీమాత నగరోత్సవం



మడుగు తేరుపై అమ్మవారి ఊరేగింపు



కోలాటం ఆడుతున్న మహిళలు

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

రాప్తాడురూరల్: ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దివాకర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా తేదీల్లో క్యాంపులకు వెళ్లి ఆధార్ కరెక్షన్, అప్‌డేషన్ తదితర చేయించుకోవాలని కోరారు. గురువారం చియ్యేడు, ఆలమూరు, అక్కంపల్లి, కామారుపల్లిలో క్యాంపులు ఉంటాయన్నారు. 12న చియ్యేడు, మన్నీల, అక్కంపల్లి, కందుకూరు–1 సచివాయాల్లో, 13న పూలకుంట, మన్నీల, ఆకుతోటపల్లి–1, కందుకూరు–1 సచివాలయాలు, 14న పూలకుంట, సోములదొడ్డి, ఆకుతోటపల్లి–2, కందుకూరు–2 సచివాలయాలు, 15న తాటిచెర్ల, సోములదొడ్డి, ఇటుకలపల్లి, కందుకూరు–2 సచివాలయాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.